సాక్షి
నిజామాబాద్
శనివారం । 5 । జూలై । 2025



పిడుగుపాటు..
వానాకాలంలో పడుతున్న పిడుగులతో ప్రతి ఏడాది పలువురు మృత్యువాత పడుతున్నారు. ఇళ్లు ధ్వంసమవుతున్నాయి.
- 8లో ▸



లోక కల్యాణార్థమే..
లోక కల్యాణార్థమే జగన్నాథ రథయాత్ర కొనసాగిస్తున్నట్లు ఇస్కాన్ బోధకుడు శ్రీమాన్ ప్రణవానంద దాస్ ప్రభూజీ పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.6 /23.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలలో పనిచేసేందుకు అర్హులైన ఫిజియోథెరపిస్టులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 13 భవిత కేంద్రాలున్నాయని, ఒక్కో కేంద్రంలో ఒక్కో పోస్టును భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రాలను సందర్శించినప్పుడు గౌరవ వేతనం రూ. వెయ్యి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బీపీటీ, ఎంపీటీ ఉన్న అభ్యర్థులు ఇంటర్‌షిప్‌తోపాటు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత పత్రాలతోపాటు దరఖాస్తు ఫారాలను కలెక్టర్ కార్యాలయంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9966071090 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రవేశాలకు..

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆగస్టు 13వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీలో ఎంపీసీ, బీజెడ్‌సీ కోర్సులు, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, డిప్లొమా బీఎల్ఐసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు అనంతరం అధ్యయన కేంద్రంలో అప్లికేషన్ అందజేయాల ని ఆమె సూచించారు.

ఫిట్స్‌తో రోడ్డుపై పడిన మహిళ

- ప్రథమ చికిత్స చేసిన ట్రాఫిక్ ఏఎస్సై



ఖలీల్‌వాడి: నగరంలోని కోర్టు చౌరస్తా వద్ద శుక్రవారం మధ్యాహ్నం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ (48) ఆకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో పడిపోయింది. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి మహిళ వద్దకు వెళ్లి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం స్థానికుల సాయంతో మహిళను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆపదలో ఉన్న మహిళను కాపాడిన ట్రాఫిక్ ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డిని స్థానికులు అభినందించారు.

ఎస్సారెస్పీలోకి 5,760 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 5,760 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద రాక తగ్గింది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, ఆవిరి రూపంలో 304, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1066.40(17.8 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.



ముబారక్‌నగర్‌లోని ఖాళీ స్థలంలో మొలిచిన పిచ్చిమొక్కలు, నిలిచిన మురికినీరు

ఖాళీ స్థలాలు.. మురుగు నిల్వలు

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- డంపింగ్ యార్డులను తలపిస్తున్న ఓపెన్ ప్లాట్లు
- కరువైన అధికారుల పర్యవేక్షణ
- బల్దియాకు భారంగా చెత్త సేకరణ వాహనాలు
- ఆహ్లాదం పంచని పార్కులు
- పూర్తిస్థాయి ఎంహెచ్‌వో లేక పనులకు ఆటంకం

సాక్షి ఫోకస్

కార్పొరేషన్ కహానీ - 4

నిజామాబాద్ సిటీ: ఇందూరు నగరంలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పూర్తిస్థాయి ఎంహెచ్‌వో లేకపోవడంతో శానిటేషన్ పనులు సజావుగా సాగడం లేదు. రోజువారీగా ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించడం లేదు. రోడ్లమీద ఆహార పదార్థాల విక్రయాలు, అపరిశుభ్రంగా టిఫిన్‌సెంటర్లు, పాలిథిన్ వాడకం తదితర వాటిపై నిఘా కొరవడింది. నివాసాల మధ్య ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. మరోవైపు చెత్త సేకరించే వాహనాల వినియోగంలో చేతివాటం పెరగడంతో బల్దియా ఆదాయానికి గండిపడుతోంది.

పార్కుల్లో..

నగరంలోని కొన్ని పార్కుల్లో అరకొర సౌకర్యాలే ఉన్నాయి. ఓపెన్ జిమ్‌లను ప్రజలు పెద్దగా వినియోగించుకోవడం లేదు. పరికరాల మరమ్మతులు లేక, వాకింగ్ కోసం ట్రాక్‌లు లేవు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ఖలీల్‌వాడిలోని ఫ్రీడం పార్కును ఎప్పుడూ తాళం వేసి ఉంచుతున్నారు. ఈ పార్కు చుట్టూ 100 పైగా ఆస్పత్రులున్నాయి. పేషెంట్లు సేదతీరేందుకు ఉన్న ఏకైక పార్కు కాస్త కాలనీ పెద్దల ఆధీనంలో ఉంటోంది. ప్రగతినగర్ పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. క్రిస్టియన్ కాలనీలోని మూడు పార్కులు ప్రజలకు అందుబాటులో లేవు. తిలక్‌గార్డెన్ మినహా చెప్పుకోదగ్గ పార్కులేమీ లేవు.

వాహనాల మరమ్మతులకు రూ.లక్షలు..

కార్పొరేషన్‌లో చేత సేకరణకు 137 వాహనాలను ఉపయోగిస్తున్నారు. వాటిలో 68 టాటా ఏసీ వాహనాలు, 34 ట్రాక్టర్లు, 9 ఐచర్‌లు, 3 కంపోస్టర్‌ల ద్వారా చెత్త సేకరణ జరుగుతోంది. వీటితోపాటు 3 స్వీపింగ్ మిషన్లున్నాయి. ఆర్టీఏ అధికారులు 20 వాహనాలను స్క్రాప్‌కు పంపించాలని నోటీసులు ఇచ్చారు. చెత్త సేకరణ వాహనాలపై నిఘా కొరవడింది. దీంతో రిపేర్ల పేరుతో ప్రతినెలా లక్షల రూపాయల బిల్లులు అక్రమార్కుల జేబుల్లోకి వెళుతున్నాయి.



ఐచర్ వెహికిల్‌ను రిపేర్ చేస్తున్న మెకానిక్

ఓపెన్ ప్లాట్స్‌తో అనర్థాలు..

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనాభా 4.30 లక్షలు. దాదాపు లక్ష నివాసాయోగ్యమైన స్థలాలు, 80 వరకు కాలనీలు ఉన్నాయి. 8 గ్రామాలు బల్దియాలో విలీనమయ్యాయి. ప్రతిరోజు 200 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. రోజూ మున్సిపల్ కార్మికులు ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తున్నారు. అయితే తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. మరోవైపు కొత్తగా వెలుస్తున్న కాలనీలతోపాటు విలీన గ్రామాలకు చెందిన డివిజన్లలో ఇళ్ల మధ్య ఓపెన్ ప్లాట్స్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుంతల్లో వర్షపు నీరు, పిచ్చి మొక్కలు పెరిగి పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో దుర్గంధం వ్యాపించి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఖాళీ స్థలాలు ఉంచితే బల్దియాకు వెకెన్సీ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ట్యాక్స్‌ను ఎవరూ చెల్లించకపోవడంతో బల్దియా ఆదాయం తగ్గిపోతోంది. గాయత్రినగర్, ఆనంద్‌నగర్, లక్ష్మిప్రియనగర్, సాయికృపానగర్, పెద్దమ్మతల్లి ఆలయం, కేసీఆర్ కాలనీ, ఖానాపూర్‌లోని భాగ్యనగర్ కాలనీ, అమ్మవెంచర్ కాలనీ, నాగారంలోని పెయింటర్స్ కాలనీ, ఆటోడ్రైవర్స్ కాలనీ, 80 క్వార్టర్స్, బోర్గాం(పి)లోని సంజీవ్‌రెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాలు, ఓపెన్ ప్లాట్‌లను గుర్తించి యజమానులకు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు అందిస్తే బల్దియాకు ఆదాయం వస్తుంది.

తరచూ రిపేర్‌కు వస్తున్నాయి



శానిటేషన్ కోసం వినియోగించే వాహనాలు తరచూ రిపేర్‌లకు వస్తున్నాయి. దీంతో వాటిని మెకానిక్ షాపులకు తరలిస్తున్నాం. మెకానికల్ ఇంజినీర్, ఇద్దరు మెకానిక్‌లను నియమించాలి. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – సాల్మన్ రాజు, ఇన్‌చార్జి, మున్సిపల్ వెహికిల్స్

కాలనీలు కంపుకొడుతున్నాయి



మా డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు సాఫీగా సాగడం లేదు. కార్మికులు రోజూ రావడం లేదు. ఆర్టీసీ కాలనీ, ఎలమ్మగుట్ట, క్రిస్టియన్ కాలనీల్లో రోడ్లమీదనే చెత్త ఉంటోంది. మోరీల్లోంచి తీసిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు.
– కొర్వ దేవేందర్, ఆర్టీసీ కాలనీ

బాధ్యత డీసీకి అప్పగించాం



శానిటేషన్‌లో కొన్ని సమస్యలు నా దృష్టికి వచ్చాయి. ప్రతిరోజు ఉదయం రెండు గంటలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నా. సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నా. డీసీ రవిబాబుకు ఇన్‌చార్జి ఎంహెచ్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించా. సమస్యలు పరిష్కారం కానున్నాయి.
– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

ట్యాక్స్ చెల్లించాలి



నగరంలో ఓపెన్ ప్లాట్ యజమానులు తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పిచ్చిమొక్కలు మొలవకుండా చూసుకోవాలి. ఖాళీగా వదిలేసిన ప్లాట్లకు వెకెన్సీ ట్యాక్స్ బల్దియాకు చెల్లించాలి.
– శ్రీనివాస్, ఏసీపీ, టౌన్‌ప్లానింగ్

సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలి

- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి
- వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగేలా అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి వైద్యాధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, హెల్త్ సబ్ సెంటర్ల వారీగా పనితీరును సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇదివరకటితో పోలిస్తే ప్రసవాల రేటు క్రమేనా తగ్గుతూ వస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం ఇటీవలి కాలంలో సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోందని, అత్యవసరం అయితే తప్ప సిజేరియన్ చేయకూడదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు చేస్తారని, మెరుగైన వైద్యం అందుతుందని ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా సంతృప్తికర సేవలు అందించాలన్నారు. సిజేరియన్‌లు ఎక్కువగా జరుగుతున్న ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యాధికారులు సమష్టిగా పనిచేస్తూ సత్ఫలితాలు సాధించాలని సూచించారు. క్రమం తప్పకుండా తాను ప్రగతిని సమీక్షిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యాక్సినేషన్ నూటికి నూరు శాతం జరగాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల నూతన భవన నిర్మాణాల స్థితిగతులు, పనుల పురోగతి, ఖాళీలు, సదుపాయాలపై చర్చించి పలు సూచనలు చేశారు. సమీక్షలో డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, వివిధ విభాగాల వైద్యాధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

నిజామాబాద్‌అర్బన్: జిల్లాకు నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రానున్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఎస్సీ రిజర్వేషన్ అమలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై సమీక్షిస్తారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



చిన్నాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి
- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి

మాక్లూర్: రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పంటలకు సకాలంలో ఎరువులు వేయకపోతే దిగుబడులు తగ్గి రైతులు నష్టపోయే అవకాశం ఉంటుందన్నారు. శుక్రవారం మండలంలోని అమ్రాద్, చిన్నాపూర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ముందుగా అమ్రాద్ సొసైటీని సందర్శించి రైతులకు సరిపడా ఎరువులు ఉన్నాయా లేదా అని సీఈవో గంగారాంను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే సొసైటీ చైర్మన్లు, సీఈవో, వ్యవసాయ అధికారి కలిసి చర్చించుకొని రైతులకు ఎరువుల ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎరువుల విషయంలో ఇబ్బందులుంటే నేరుగా తన దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం నిజాంసాగర్ 74 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ గట్టుపై హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కకు మరో మొక్కకు ఉన్న దూరం విషయమై అక్కడే ఉన్న ఎంపీవో టీ శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీవో ఓంకార్‌లను అడిగి తెలుసుకున్నారు. గ్యాప్ ఉన్న చోట్ల మళ్లీ మొక్కలు నాటాలని సూచించారు. చిన్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడారు. నిర్మాణాలు సజావుగా సాగుతున్నాయా? ఇసుక, మొరం విషయంలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. నిధులు సిద్ధంగా ఉన్నందున ఇళ్ల నిర్మాణం చకచకా పూర్తి చేసుకోవాలన్నారు. బిల్లులు సకాలంలో అందిస్తామని, ఎలాంటి అనుమానం వద్దని లబ్ధిదారులతో చెప్పారు. మండల కార్యాలయాలకు వెళ్లి ఎంపీడీవో లక్ష్మారెడ్డి, తహసీల్దార్ శేఖర్‌లతో సమావేశమై మండల స్థితిగతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మ, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఆర్ఐ షఫీ తదితరులు ఉన్నారు.

‘లక్ష్మి’ ఆయకట్టుకు నీళ్లివ్వండి

- వరినారు కోసం విడుదల చేయాలని రైతుల డిమాండ్
- ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 17 టీఎంసీల నీరు



లక్ష్మికాలువ హెడ్‌రెగ్యులేటర్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువకు నీటి విడుదల కోసం ఆయకట్టు రైతుల నుంచి రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. ప్రాజెక్ట్ నిర్మాణానికి సర్వస్వం కోల్పోయిన జిల్లా రైతులకు నీరందించే ఏకైక కాలువ లక్ష్మి కాలువ. ఎస్సారెస్పీలో 1064 అడుగుల నీటిమట్టం దాటితే లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల చేయొచ్చు. ప్రస్తుతం నీటిమట్టం క్రమంగా పెరుగుతూ 1066.40 అడుగులకు చేరింది. దీంతో నీటి విడుదల చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కాలువ ద్వారా నీటి విడుదల చేపడితే వరినారు పోసుకునే అవకాశం ఏర్పడుతుందని రైతులు చెప్తున్నారు. లక్ష్మి కాలువ ఆధారంగా 50 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ప్రధాన కాలువ ద్వారా 25 వేల ఎకరాలు, కాలువ ఆధారంగా నిర్మించిన లిఫ్టుల ద్వారా 25 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఖరీఫ్‌లో కాలువ ద్వారా 2.5 టీఎంసీల నీటిని విడుదల చేస్తే ఆయకట్టు పంటలు గట్టెక్కుతాయని అధికారిక రికార్డులే స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టినా నారు పోసుకోవడానికి ఇబ్బంది ఉండదని రైతులు చెప్తున్నారు.



ఆయకట్టు భూమిలో పోసిననారు

నిరుపయోగంగా లిఫ్టు

ప్రాజెక్టులోని హెడ్‌రెగ్యులేటర్ ద్వారా లక్ష్మి కాలువకు నీటిని అందించలేకపోతే, లక్ష్మి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి కాలువకు అందించాలి. ప్రాజెక్ట్ నీటిమట్టం 1064 అడుగుల వరకు మాత్రమే కాలువ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. 1045 అడుగుల నీటిమట్టం వరకు నీటి సరఫరా జరిగేలా రూ. 25 కోట్లతో లిఫ్టును నిర్మించారు. కానీ ఇప్పటికీ వినియోగించడం లేదు. లిఫ్టు ద్వారా నీటి సరఫరా చేసినా సకాలంలో నీరు అందుతుందని రైతులు చెప్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి నీటి విడుదల చేపట్టాలని కోరుతున్నారు.

నీటి విడుదల చేపట్టాలి



ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా వెంటనే నీటి విడుదల చేపట్టాలి. ప్రస్తుతం వరినారు పోసేందుకు కూడా నీరు లేదు. ప్రాజెక్ట్‌లో ఉన్న లిఫ్టును రన్ చేస్తే ముందస్తుగానే పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. లక్ష్మి కాలువ ఆయకట్టు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. – ముస్కు నర్సయ్య, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు

పేలుడు పదార్థాల కలకలం

- 1,564 జిలెటిన్ స్టిక్స్, 41 డిటోనేటర్‌లు
- మరో 16 బెండళ్ల కార్డెక్స్ వైరు, ఇతర సామగ్రి స్వాధీనం
- నలుగురు నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

కామారెడ్డి క్రైం: పెద్ద ఎత్తున పేలుడు పదార్థాల నిల్వలు బయటపడటం కామారెడ్డి జిల్లా కేంద్రంలో శుక్రవారం కలకలం రేపింది. ఓ ఇంటి నిర్మాణం కోసం బండరాళ్ల బ్లాస్టింగ్‌కు పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. పెద్ద మొత్తంలో జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్‌లు, ఇతర సామగ్రి పట్టుబడ్డాయి. ఘటనకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ చైతన్య రెడ్డి మీడియాకు వెల్లడించారు. కామారెడ్డిలోని పీఎంహెచ్ కాలనీలో నివాసం ఉంటున్న చింతల శ్రీధర్‌కు కేపీఆర్ కాలనీలో ఓ ప్లాటు ఉంది. ఇంటి నిర్మాణం చేయడానికి పనులు ప్రారంభించాడు. గుంతలు తీయగా వచ్చిన బండరాళ్లను పేలుడు పదార్థాలతో పేల్చివేసి తొలగించడానికి బొంత సంపత్, లక్ష్మీనారాయణ, రాజులతో రూ.50 వేలకు ఒప్పందం చేసుకున్నాడు. అనుమతులు లేకుండా, అక్రమ పద్ధతిలో సేకరించిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్‌లు, కార్డెక్స్ వైరు, బ్యాటరీలతో బండరాళ్లను పేల్చడానికి ఏర్పాట్లు చేశారు. చుట్టు పక్కల వారు గమనించి ప్రాణ, ఆస్తి నష్టానికి అవకాశం ఉంటుందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో మరోచోట పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు నిల్వ చేసిన విషయం బయటపడింది. లింగాపూర్ శివారులో ఇటీవల వెలసిన శ్రీవారి వెంచర్‌లోని రేకుల షెడ్డులో మొత్తం 1,564 జిలెటిన్ స్టిక్స్, 41 డిటొనేటర్‌లు, 16 బెండల్స్ (సుమారు 4,300 మీటర్లు) కార్డెక్స్ వైరు, బ్యాటరీ, ఒక చెక్ మీటర్, ఇతర సామగ్రిని అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. అదేవిధంగా కేపీఆర్ కాలనీలో బండరాళ్లను పేల్చడానికి అమర్చి ఉన్న జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్‌లను హైద్రాబాద్ నుంచి బాంబ్ స్క్వాడ్‌ను రప్పించి పేల్చివేశారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రజల రాకపోకలను నిలిపివేశారు. పేలుడు పదార్థాలను శంకర్, స్వామి అనే వ్యక్తుల ద్వారా తెప్పించినట్లు విచారణలో తేలింది. చింతల శ్రీధర్, సంపత్, లక్ష్మీనారాయణ, రాజులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వో నరహరి, ఎస్సై శ్రీరాం, కానిస్టేబుళ్లు నరేశ్, విశ్వనాథ్, అనిల్, విజయ్ గౌడ్, వినయ్, సంపత్, నర్సారెడ్డి లను అభినందించారు.

ఆన్‌లైన్‌లోనే ఓటరు నమోదు చేయాలి

- నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్



బీఎల్‌వోలతో ఆర్డీవో, తహసీల్దార్, మాస్టర్ ట్రైనర్స్

మోపాల్: ఓటరు నమోదు కార్యక్రమం ఆన్‌లైన్‌లో చేపట్టాలని, 18 ఏళ్లు నిండిన ఎవరైనా ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా నమోదు కావచ్చని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మోపాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌వోలకు ఒకరోజు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈసందర్భంగా బీఎల్‌వోల విధులు, సర్వేలు, ఇతరత్ర ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రొజెక్టర్ ద్వారా ఆర్డీవో వివరించారు. అనంతరం రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓటరు నమోదు కోసం ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఎవరైనా నేరుగా యాప్‌లో ఓటరు నమోదు చేసుకోవచ్చని, బీఎల్‌వోలుసైతం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌లోనే చేయాలన్నారు. ఓట్ల మార్పులు చేర్పులు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, తదితర వివరాలన్నీ యాప్‌లోనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామేశ్వర్, ఎలక్షన్ డీటీ అశ్వక్ హైమద్, మోపాల్ డీటీ సరిత, ఆర్ఐ రాజేశ్వర్, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్ మల్లికార్జున్, ప్రవీణ్‌రెడ్డి, 43 మంది బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దొడ్డి కొమురయ్యకు నివాళి



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా కొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొమురయ్య పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి



నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటకకు గవర్నర్‌గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



ఆర్మూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈసందర్భంగా కోటపాటి మాట్లాడుతూ.. రామచంద్రరావు విద్యార్థి, యువమోర్చా నాయకుడిగా, ఎమ్మెల్సీగా, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవంతో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవాది ఊరే బాలయ్య, బీజేపీ సీనియర్ నాయకుడు రుక్మాజీ ఉన్నారు.

పిడుగుపాటు.. అప్రమత్తతే మేలు!

మే13న మాక్లూర్ మండలంలోని మాణిక్‌భండార్‌లో చిట్యాల జనార్దన్ అనే వ్యక్తి ఇంటిపై పిడుగుపడింది. దీంతో అతడి ఇంటి స్లాబు స్వల్పంగా ధ్వంసం కాగా ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు పనికి రాకుండా పోయాయి.

గత ఏడాది జూన్ 7న డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు వర్షం రావడంతో చెట్టు కింద నిలిచాడు. చెట్టుపై పిడుగుపడటంతో ఆ వ్యక్తి (38) మృతి చెందారు. వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా, పిడుగుపాటుతో మృతి చెందినట్లు రిపోర్టు వచ్చింది.



ఖలీల్‌వాడి: మండుటెండల వేడిమి చల్లారక ముందే నైరుతి రుతుపవనాలు వచ్చేశాయి. వర్షాకాలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. ఈ పిడుగులతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పిడుగుల కారణంగా ప్రతి యేటా వందలాది మంది చనిపోతున్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో పిడుగులు పడటంతో ఆరుగురు మృత్యువాతపడ్డారు. ఈనేపథ్యంలో వర్షాకాలంలో పిడుగుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం నివారించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

పిడుగులు ఏర్పడేది ఇలా..

పిడుగు అనేది ఆకాశంలో ఏర్పడే విద్యుత్ ఉత్సర్గం. సాధారణంగా మేఘాల మధ్య సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు ఆవిరై మేఘాలు ఏర్పడినప్పుడు, వాటిలో ధనావేశిత, రుణావేశిత కణాలు ఏర్పాడుతాయి. ఈ కణాలు ఒకదానితో ఒకటి ఆకర్షించబడుతాయి. ఇలా ఆకర్షణ జరిగినప్పుడు విద్యుత్ ప్రవాహం ఏర్పడి, మెరుపు, ఉరుములతో కూడిన పిడుగు భూమిని తాకుతుంది. పిడుగు పడిన వద్ద వేల డిగ్రీల వేడి ఉండటంతో ప్రమాదాలు సంభవిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఉరుములతో కూడిన వర్షం పడుతున్నప్పుడు పిడుగు పడితే ఆరుబయట ఉన్నప్పుడు భూమిపై కూర్చుండాలి. పిడుగు పడే సమయంలో ఎక్కువ శబ్దం వస్తుంది. కావున ఆ సమయంలో చెవులు మూసుకోవాలి.
- రైతులు వర్షాలు పడేసమయంలో బోరుబావుల వద్దకు, మోటర్లు వద్దకు వెళతారు. అలాంటి సమయంలో సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి. సెల్ ఫోన్లు వాడకూడదు.
- ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు ఇంటి పైకప్పుపైన గాని, బయట ఉండకూడదు. వ్యవసాయక్షేత్రాలు, బయట పనిచేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం చేయరాదు. చెరువులు, కుంటలకు దూరంగా ఉండాలి.
- టవర్లు, చెట్లు, కరెంట్ స్తంభాలు, ఎత్తైన ప్రాంతాలకు వెళ్లకుండా దూరంగా ఉండాలి. ఎత్తైన ప్రదేశాలు పిడుగులను ఆకర్షిస్తాయి. వర్షం పడుతున్నప్పుడు సమీపంలో ఉండే ఇంటిలోకి వెళ్లాలి.
- ట్రాన్స్‌ఫార్మర్స్, విద్యుత్ సబ్‌స్టేషన్లకు దూరంగా ఉండాలి. ఎలక్ట్రికల్ వస్తువులైన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, విద్యుత్ వైర్ల వద్ద ఉండవద్దు.

ఇళ్లపై పడకూడదంటే..



ఇళ్లపై పిడుగులు పడితే ఇంట్లోని విద్యుత్ పరికరాలు, సామగ్రి కాలిపోవడంతోపాటు, ఇళ్లు దెబ్బతినే అవకాశం ఉంది. దీంతో ఇళ్లపై పిడుగులు పడకూడదంటే ఇంటికి 'లైట్నింగ్ అరెస్టర్'ను ఏర్పాటు చేసుకోవాలి. ఎత్తైన భవనాలకు దీనిని ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

మేఘాలు వేగంగా రావడంతోనే పిడుగులు..

వర్షాకాలం ప్రారంభంలో మేఘాలు వేగంగా ప్రయాణించడంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయి. పిడుగులు పడే సమయంలో వ్యవసాయక్షేత్రాలతోపాటు ఆరుబయట ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. ఇళ్లు, వ్యాపార సముదాయాల దగ్గర తప్పనిసరిగా ఎర్తింగ్ పెట్టుకోవాలి. పిడుగులపై చిన్న నిర్లక్ష్యం వహించినా ప్రాణాల మీదికి వచ్చే అవకాశం ఉంటుంది.

– జి పరమేశ్వర్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, నిజామాబాద్

రామారెడ్డిని రక్షించే అష్ట భైరవులు

మీకు తెలుసా?

రామారెడ్డి గ్రామాన్ని పురాతన కాలం నుంచి ఊరు చుట్టూ ఉన్న అష్ట భైరవులు రక్షిస్తుంటారని గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. అష్ట భైరవులు స్వయంభుగా వెలియగా, కాలక్రమేణ రెండు విగ్రహాలు మాత్రమే పూజలందుకుంటున్నాయి.

- గ్రామంలోని 12ఫీట్ల దిగంబర కాలభైరవుడి విగ్రహానికి ఆలయంతోపాటు నిత్య పూజలందుకుంటుండగా, మరో విగ్రహం కాశిపల్లి కాలభైరవుడిగా పూజలు అందుకుంటున్నాడు. మిగతా విగ్రహాలు కనుమరుగయ్యాయి.
- దేశంలోని కాశీ, కాశ్మీర్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో అక్కడక్కడ కాలభైరవుడి ఆలయాలు ఉన్నా, ప్రత్యేకంగా ఆలయం ఉన్నది మాత్రం ఇక్కడే.
- స్వామివారికి వైశాఖమాసంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- ప్రతి యేటా కార్తీక బహుళ పంచమి నుంచి నవమి వరకు కాలభైరవుడి జన్మదిన ఉత్సవాలు నిర్వహిస్తారు.
- గతంలో కరువు కాటకాలు వచ్చినప్పుడు గ్రామస్తులందరూ కాలభైరవుడి భయంకర విగ్రహానికి ఆవు పేడ పూసి కానరాకుండా చేయడంతో రెండు మూడు రోజులకే సమస్యలన్నీ పరిష్కారం అయ్యేవి.
- గ్రామాన్ని కాలభైరవుడు రక్షిస్తుండటంతో ప్రజలు భక్తితో పూజలు నిర్వహిస్తూ, అభివృద్ధిలోకి తెచ్చారు.
- స్వామివారికి వామాచార, దక్షిణాచార పద్ధతుల్లో పూజలు నిర్వహిస్తారు.
- ఈ ఆలయం 1978 నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉంది.

– రామారెడ్డి



ఇసన్నపల్లిలోని కాలభైరవుడు



రామారెడ్డిలోని కాశిపల్లి కాలభైరవుడు

సమాచారం

అత్యవసరంలో డయల్ 112

ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర సేవలన్నింటి కోసం డయల్ 112ను అమలులోకి తీసుకువచ్చింది. డయల్ 100, 108, 101 స్థానంలో 112 సేవలను రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉంటాయి. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి ఈ సేవలను ఆపరేట్ చేస్తారు. సెల్‌ఫోన్ లేదా ఫోన్ నుంచి 112కు కాల్ చేస్తే పోలీస్, ఫైర్, మెడికల్, చిల్డ్రన్, ఉమెన్, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి అత్యవసర సేవలను ఈ ఒక్క నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.

ఒకరి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన లెగ్గల రాజు అనే వ్యక్తిని రిమాండుకు తరలించినట్లు ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. లింగంపేటకు చెందిన చాకలి రాకేష్‌ను ఏప్రిల్ 14న రాత్రి రాజు చంపడానికి ఇనుప రాడ్‌తో దాడి చేసి గాయపరిచాడన్నారు. ఈ ఘటనపై రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజును గురువారం రాత్రి అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

బీబీపేట: మండల కేంద్రంలోని స్థానిక వారాంతపు సంత వద్ద అక్రమంగా నిర్మించిన దుకాణం డబ్బాను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రమేష్ తొలగించారు. గ్రామ పంచాయతీకి ఎలాంటి సమాచారం అందించకుండా రాత్రి వేళలో నిర్మించడంతో ఉదయాన్నే అధికారులు తొలగించారు. అనంతరం నిర్మించిన వారిని అధికారులు పిలిపించి మందలించారు.

మోతాదు మేరకే ఎరువులు వాడాలి

వేల్పూర్: అధికారులు సూచించిన మోతాదు మేరకే ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరస్వామి రైతులకు సూచించారు. వేల్పూర్, పచ్చలనడ్కుడ, జాన్కంపేట్, మోతె, పడగల్, లక్కోర గ్రామాల్లోని గిడ్డంగులలో ఉన్న ఎరువుల నిల్వలను, రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాదారు పాస్‌బుక్‌లో ఉన్న సాగు విస్తీర్ణం, పంట దశ ఆధారంగా ఎరువులను ఇవ్వాలని, దానివల్ల యూరియా సరఫరాలో ఇబ్బంది తలెత్తకుండా ఉంటుందన్నారు. మండలంలో దాదాపు 300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందరాదన్నారు. మోతె గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించి ఎరువులు పిచికారి చేస్తున్న రైతులతో మాట్లాడారు. యూరియా అధికంగా వాడడం వల్ల పంటపై పురుగులు, తెగుళ్ల తాకిడి ఎక్కువ అవుతుందన్నారు. ఏవో శృతి, సొసైటి సిబ్బంది ఉన్నారు.



ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

లోక కల్యాణార్థమే జగన్నాథ రథయాత్ర

- ఇస్కాన్ బోధకుడు శ్రీమాన్ ప్రణవానంద దాస్ ప్రభూజీ
- నగరంలో వైభవంగా రథోత్సవం





మాట్లాడుతున్న ప్రణవానంద, సీపీ సాయి చైతన్య



జగన్నాథ రథాన్ని లాగుతున్న భక్తులు

నిజామాబాద్ రూరల్: ఇందూరు నగరంలో లోకకల్యాణం కోసం జగన్నాథ రథయాత్ర కొనసాగిస్తున్నట్లు ఇస్కాన్ అంతర్జాతీయ బోధకుడు శ్రీమాన్ ప్రణవానంద దాస్ ప్రభూజీ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథంపై బలదేవ్, సుభద్రమయి, జగన్నాథుడి విగ్రహాలను ఏర్పాటు చేసి, ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీమాన్ ప్రణవానంద దాస్ ప్రభుజీ మాట్లాడుతూ.. ఇస్కాన్ చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు అంతర్జాతీయంగా విజయవంతగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమానికి సీపీ సాయి చైతన్య హాజరై స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథయాత్ర ప్రశాంతమైన వాతవరణంలో జరుపుకోవాలని సీపీ పేర్కొన్నారు. రథయాత్రలో భక్తులు శ్రీకృష్ణుని నామస్మరణ చేయగా, నగరం ఆధ్యాత్మిక శోభ సంతరించరించుకుంది. మహిళలు రోడ్లపై వేసిన వివిధ రకాల రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం అధ్యక్షుడు రామనంద ప్రభురాయ్ దాస్, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ వెంకట శివకుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాజా వెంకటరెడ్డి, మాదాసు స్వామి, అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇందూరులో ఇస్కాన్ ఆలయం నిర్మిస్తాం

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఇందూరులో ఇస్కాన్ ఆలయం నిర్మిస్తామని, హిందువులు సహకరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. రథయాత్ర అనంతరం వినాయక్‌నగర్‌లోని విజయలక్ష్మీగార్డెన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించడానికి జిల్లా వాసులందరూ సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 56 రకాల చప్పన్‌భోగ్ నైవేద్యాలను స్వామివార్లకు సమర్పించారు.



రథంపై ఉన్న దేవతామూర్తులు



కంఠేశ్వర్ వద్ద నృత్యాలు చేస్తున్న చిన్నారులు



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన పీసీసీ చీఫ్



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను శుక్రవారం పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ సమ్మేళనం ఏర్పాట్లను ఆయన వారికి వివరించారు. పీసీసీ చీఫ్‌తోపాటు పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, గడ్కోల్ భాస్కర్ రెడ్డి ఉన్నారు. అలాగే జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వారు మీనాక్షి నటరాజన్‌కు వివరించారు.

50వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తాం



నిజామాబాద్‌నాగారం: దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహించి 50 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం అందజేస్తామని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు అన్నారు. నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో శుక్రవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) 12వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదానం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ముస్తాల సాయికృష్ణ ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేయగా వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు, ప్రతినిధులు తోట రాజశేఖర్, రామకృష్ణ, ప్రణీష్, నర్సయ్య ఉన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు కంటైనర్ దగ్ధం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని దగ్గి గ్రామ శివారులోగల 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఓ కంటైనర్ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైంది. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కంటైనర్ దగ్గి శివారులోకి రాగానే వాహనం నుంచి మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపాడు. లారీలో ఉన్న వివిధ రకాల పార్సిళ్లు, కొరియర్ వస్తువులు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సదాశివనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

ఒకరిపై దాడి- నిందితుల అరెస్టు

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లగుట్టతండాకు చెందిన షాబాజ్ సలావుద్దీన్ గురువారం మధ్యాహ్నం తన ప్లాట్లలో పెరిగిన కంపచెట్లను జేసీబీతో శుభ్రం చేస్తుండగా తండాకు చెందిన రాము, రామునాయక్, బాదావత్ సంతోష్, అతని కొడుకులు సలావుద్దీన్‌పై దాడిచేసి గాయపరిచారు. ఈమేరకు బాధితుడు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. శుక్రవారం రాము, రామునాయక్‌లను రిమాండ్‌కు తరలించినట్లు, మిగిత ఇద్దరిని కూడా త్వరలో రిమాండ్ చేస్తామని ఎస్సై ఆరీఫ్ తెలిపారు.

గంజాయి విక్రేతల..

ఖలీల్‌వాడి: నగర శివారులోని దుబ్బ బైపాస్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వెంకటేష్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శుక్రవారం సాయంత్రం బైపాస్ రోడ్డులో నిఘా ఉంచగా, రెంజల్ మండలం నీలా గ్రామానికి చెందిన పుల్లె లక్ష్మీనర్సింహ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 250 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై నర్సింహచారీ, హెడ్ కానిస్టేబుళ్లు భూమన్న, రాజన్న, కానిస్టేబుళ్లు భోజన్న, విష్ణు, అవినాష్, సాయి కుమార్, రాంబచ్చన్ ఉన్నారు.

ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బ బైపాస్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఉంచగా, జ్ఞానేశ్వర్, షేక్ అయాజ్ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 60 గ్రాముల గంజాయిని సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

బోధన్: పట్టణంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా రాకాసీపేటకు చెందిన అర్షద్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి శుక్రవారం బోధన్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి శేషతల్ప సాయి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని టౌన్ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

బోధన్: ఎడపల్లి మండలం ధర్మారం గ్రామ శివారులోని సిద్ధ చెరువులో ఓ వ్యక్తి చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ధర్మారం గ్రామానికి చెందిన మేకల ప్రశాంత్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

అత్తను హత్యచేసిన అల్లుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజేష్

పిట్లం(జుక్కల్): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అత్తను హత్య చేసిన అల్లుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు బాన్సువాడ సీఐ రాజేష్ తెలిపారు. బాన్సువాడ రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జిన్నా లక్ష్మీ (50) మూడేళ్ల క్రితం అల్లుడైన జిన్న బాగరాజుకు రూ.లక్ష అప్పుగా ఇచ్చింది. డబ్బులు ఇవ్వమని అల్లుడిని ఎన్నిసార్లు అడిగిన ఇవ్వలేదు. ఇటీవల బాగరాజు తను పండించిన జొన్నలను విక్రయించగా వచ్చిన డబ్బులను అత్త అకౌంట్‌లో వేయించాడు. ఆ డబ్బుల కోసం అతడు అత్తను అడిగాడు. తనకు ఇవ్వాల్సిన బాకీ కింద ఆ డబ్బులు జమచేసుకుంటానని అత్త అతడికి తెలిపింది. దీంతో పగ పెంచుకున్న బాగరాజు తన అత్తను చంపాలని పథకం పన్ని గురువారం మధ్యాహ్నం ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన రోజే నిందితుడు తన బైక్‌పై హత్యకు ఉపయోగించిన కమ్మ కత్తితో పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

మల్కాపూర్‌లో ఉద్రిక్తత

- అక్రమ ఇంటి నిర్మాణాన్ని తొలగించిన అధికారులు
- ఆత్మహత్యకు యత్నించిన కుటుంబీకులు



ఆత్మహత్యకు యత్నిస్తున్న బాధిత కుటుంబీకులు

ఎల్లారెడ్డి: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణం కూల్చివేతతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పెద్దెడ్ల నర్సింలు (బీజేపీ మండల అధ్యక్షుడు) ప్రభుత్వ స్థలంలో రెండు గజాల, ఆరు అంగులాల స్థలం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టినట్లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు వచ్చింది. దీంతో సదరు ఇంటి యజమానికి నిర్మాణం నిలిపివేయాలని పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా ఇంటి నిర్మాణం చేపట్టడంతో డీఎల్‌పీవో సురేందర్ శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయించారు. అంతకుముందు కూల్చివేతకు వచ్చిన అధికారులను ఇంటి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. కుటుంబసభ్యులు అశోక్, రాకేష్, కృష్ణలు ఒంటిపై పెట్రోలు పోసుకోవడంతో పోలీసులు స్పందించి వారిపై నీరు పోసి, ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలోకి ఎవరు రాకుండా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేష్‌లు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధితుడు నర్సింలు మాట్లాడుతూ.. రాజకీయ కక్షతోనే ఇంటి నిర్మాణం కూల్చివేయించారని ఆరోపించారు. తాను ఎలాంటి అక్రమ నిర్మాణం చేయలేదని తన సొంత స్థలంలోనే నిర్మించుకున్నట్లు తెలిపారు.

అనుమతి లేని పాఠశాల సీజ్



బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో గల మార్కెట్ రోడ్డులో శ్రీ చైతన్య పేరుతో నడుస్తున్న పాఠశాలను ఎంఈవో నాగేశ్వరావు సీజ్ చేశారు. శుక్రవారం లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దీనితో ఎంఈవో పాఠశాల అనుమతి పత్రాలను తనిఖీ చేసి చూడగా ఎటువంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. అనుమతులు లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించవద్దని సూచించారు. నేతలు రాథోడ్ జీవన్, వంశీ నాయక్ ఉన్నారు.

అటవీభూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పరిధిలోని అటవీ భూములను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక ఎఫ్ఆర్‌వో వాసుదేవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమంగా అటవీ భూమిలోకి ప్రవేశించి చెట్లను, వాటి కొమ్మలను నరికినా, అటవీ భూమిని చదునుచేసినా, దున్నినా, అడవిలో దారులు ఏర్పాటు చేసినా, అటవీభూముల సరిహద్దులను చెరిపేసినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతోపాటు అటవీభూముల నుంచి ఇసుక, మొరం, రాళ్ల తరలించినా, వన్యప్రాణులను వేటాడినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఉపయోగించిన జేసీబీ, ట్రాక్టర్, లారీ, ఆటో, బైక్ వంటి వాహనాలను సైతం సీజ్ చేస్తామని చెప్పారు.